విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 03 ఆగస్టు 2024 8 పేజీలు

అటవీ భూములు అన్యాక్రాంతం

- ఆక్రమణదారుల చేతిలో 100 ఎకరాల అటవి భూములు
- అటవీ అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు
- విచారించి చర్యలు తీసుకుంటాం: సెక్షన్ ఆఫీసర్ ధనలక్ష్మి



2

తిరుమల శ్రీవారి సేవా భాగ్యం

పూర్వజన్మ సుకృతం: టీటీడీ ఈవో

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : కలియుగ ప్రత్యక్ష ద్కెవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి భక్తులకు సేవ చేసేందుకు ఇటీవల టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ఈవో జె.శ్యామలరావు చెప్పారు.తిరుమలకు విచ్చేసే భక్తులందరికీ టీటీడీ అందించే శ్రీవారి దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు, అందరి సమన్వయంతో భక్తులకు తిరుమల యాత్ర ఒక దివ్యానుభూతిని కల్పించేలా కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు ఈ ఏడాది అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల పనులను సెప్టెంబరు చివరినాటికి పూర్తి

2

క్రికెట్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురండి

ఇండోర్ స్టేడియంలో అన్ని వసతులు కల్పించండి: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గొల్లవానిగుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియంలో అన్ని పనులు పూర్తి చేసి క్రీడాకా రులకు అందుబాటులోనికి తీసుకురావాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో పునః ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న పనులను శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. అలాగే కచ్చపి ఆడిటోరియం, ఇండోర్ స్టేడియం, గొల్లవాని గుంట వద్ద ఏర్పాటు చేస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడాకారులకు అనుగుణంగా క్రికెట్ స్టేడియం లోనూ, ఇండోర్ స్టేడియం లో వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కచ్చపి ఆడిటోరియం ను పరిశీలించి కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించి, నిర్వహణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

2

కార్వేటినగరంలో ప్రతక్షమైన పునుగుపిల్లి

విశాలాంధ్ర -కార్వేటినగరం: శేషాచలం అడువుల్లో అరుదుగా కనిపించే పును గుపిల్ల కార్వేటినగరం - పచ్చికాపల్లం మార్గంలోని చిన్నకనుమ వద్ద ప్రత్య క్షమైంది.

తరువాయి 2లో

అటవీ భూములు అన్యాక్రాంతం

విశాలాంధ్ర - దొరవారిసత్రం: భూమి రేట్లు ఒక్కసారిగా పెరగడంతో భూకబ్జాదారులు రోజు రోజుకి పెరిగిపోతున్నారు. ఎక్కడైనా కొంచెం ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వెంటనే ఈ భూ కబ్జా దారులు అక్కడ ప్రత్యక్షమై స్థలాలను ఆక్రమించేస్తున్నారు. చివరికి వణ్యప్రాణులు విశాలంగా తిరిగే రిజర్వుడు ఫారెస్ట్ భూములను కూడా వదలడం లేదు. ఓ వైపు అడవిలో ఉన్న సంపదను దోచేస్తూనే మరోవైపు అడవినే ఆక్రమించేస్తూ పంట పొలాలుగా మార్చేస్తున్నారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని పడమటి కండ్రిగ, వడికండ్రిగ గ్రామాల వద్ద సుమారు 100 ఎకరాలకు పైగానే రిజర్వుడు ఫారెస్ట్ భూములను భూ కబ్జాదారులు ఆక్రమించి పంట పొలాలుగా మార్చేశారు. దొరవారిసత్రం మండలంలో సుమారు 1400 హెక్టార్ల రిజర్వుడు ఫారెస్ట్ భూములు ఉన్నాయి. ఈ భూములపై కొంత మంది బడా నాయకులు కన్నేసి అక్కడ ఉన్న చెట్లను తొలగించి పంట పొలాలుగా మార్చి సాగుచేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. దీంతో అడవులను ఈ దళారులు సొంతం చేసుకోవడంతో అడవిలో ఉన్న మూగ జీవులు వారు ఏర్పాటు చేసే కరెంటు తీగలకు తగిలి అంతమవుతున్నాయి.

అటవి సంపదను దోచి ఆపై భూములను దోచేస్తున్నారు...: దొరవారిసత్రం మండల పరిధిలోని అనేపూడి, పడమటి కండ్రిగ, వడికండ్రిగ, శ్రీధనమల్లి తదితర గ్రామల సమీపంలో ఉన్న అటవీ భూములలో ఉన్న కలబంధను నరికి ఆపై రాత్రి వేళల్లో అటవీ భూముల్లో ఉన్న గ్రావెల్ను అమ్మేస్తున్నారు. చివరికి మూగ జీవులకు నిలయంగా ఉన్న అటవీ భూములను కూడా ఆక్రమించేసి పంట పొలాలుగా మార్చేస్తున్నారు.

కరేంట్ కంచెలకు బలి అవుతున్న వణ్యప్రాణులు..: దొరవారిసత్రం మండల పరిధిలోని పడమటి కండ్రిగ, వడికండ్రిగ గ్రామాల సమీపంలోని రిజర్వుడు ఫారెస్ట్ భూములను ఆక్రమించి ఆ పొలాలకు కరెంట్, సోలార్ విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడంతో వణ్యప్రాణులు విద్యుదాఘాతంతో బలవుతున్నాయి. పందుల కోసం ఏర్పాటు చేసే ఈ విద్యుత్ తీగలకు జింకలు తగిలి మృతి చెందుతున్నాయి. దీంతో ఈ జింకలను అక్కడికి అక్కడే మట్టిలో కప్పేస్తున్నారు.

ఆక్రమణ దారులు నుండి అటవి అధికారులకు భారిగా ముడుపులు: ఓపైపు కలబంద మరోవైపు గ్రావేల్ ఇవి చాలుక అటవీ భూములనే ఆక్రమణ చేస్తుంటే అధికారులు మాత్రం వారికి ఇచ్చే ముడుపులను తీసుకొని చూసీ చూడనట్లు వ్యవహరి స్తున్నారు. మండలంలోని పడమటి కండ్రిగ, వడికండ్రిగ సమీపంలో సుమారు 100 ఎకరాల భూమిని ఆక్రమించి ఆపై ఆ పొలాల్లోనే విద్యుత్, సోలార్ తీగలను బహిరంగానే ఏర్పాటు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు.

ఫారెస్ట్లో రోడ్లు...: రిజర్వుడు ఫారెస్ట్ భూములలో దర్జాగా మట్టి రోడ్లు నిర్మించుకుంటూ వాహనాల రాకపోకలను సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం ఫారెస్ట్ భూములను ఆక్రమించడమే నేరము అందులో దర్జాగా రోడ్లు వేశారంటేనే ఈ భూ కబ్జాదారులకు, ఫారెస్ట్ అధికారులు ఎంతగా సహకరిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది.

విచారించి చర్యలు తీసుకుంటాం.... ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ధనలక్ష్మి : రిజర్వుడు భూములు ఆక్రమించిన విషయం మా దుష్టికి రాలేదు. ఎవరైనా ఆక్రమణ చేసినా, ఫారెస్ట్ భూములలో రోడ్లు నిర్మించినా అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

పూర్వజన్మ సుకృతం

(మొదటి పేజీ తరువాయి) చేసేందుకు అధికారులను ఆదేశించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం.శ్రీవారి పవిత్రోత్సవాలు :ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఆగస్టు 14న అంకురార్పణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి.ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది.శ్రీవారి పుష్కరిణి మూత తిరుమల శ్రీవారి ఆలయం వద్ద గల పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు 1 నుండి పుష్కరిణిని మూసివేశాం. ఈ కారణంగా నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో షవర్లు ఏర్పాటుచేశాం. భక్తులు వీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాం.ఇటీవల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తీసుకున్న పలు ముఖ్య నిర్ణయాలు ఆఫ్లైన్లో రోజుకు 1000 శ్రీవాణి దర్శనం టికెట్లు సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచేందుకుగాను జూలై 22వ తేదీ నుండి ఆఫ్ లైన్లో రోజుకు 1000 శ్రీవాణి దర్శనం టికెట్లను మాత్రమే జారీ చేయాలని నిర్ణయించాం.శ్రీవాణి దాతలకు తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900, మిగిలిన 100 టికెట్లను విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్లో జారీ చేస్తున్నాం. అన్నప్రసాదాల రుచి మరింత పెంచేందుకు చర్యలు తిరుమలలో ప్రతిరోజు వేలాదిమంది భక్తులకు అందించే అన్నప్రసాదాల రుచిని మరింత పెంచేందుకు నాణ్యమైన బియ్యం, వంటశాలలో అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా తిరుమలలో తాగునీరు, అన్నప్రసాదాలు, ముడిసరుకులను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో అత్యాధునిక ల్యాబ్ను ఏర్పాటు చేస్తున్నాం. క్యూ లైన్లలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు క్యూలైన్లల్లో, కంపార్ట్మెంట్లలో వేచి ఉండే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగు నీరు, పాలు, అన్నప్రసాదాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరివేక్షించేలా ప్రత్యేకంగా కొందరు అధికారులకు బాధ్యతలు అప్పగించాం.భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో ఆరు చోట్ల అన్నప్రసాదాలు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు, అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. తిరుమలలో దళారుల ఏరివేతకు చర్యలు శ్రీవారి భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి మోసగిస్తున్న అనేక మంది దళారులను ఎప్పటికప్పుడు కనిపెట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. తిరుమలలో భక్తులకు సరసమైన ధరలతో పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలి శ్రీవారి భక్తులకు సరసమైన ధరలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మరియు రుచికరమైన ఆహారాన్ని అందించడమే టీటీడీ లక్ష్యం. టీటీడి నిబంధనలు పాటించని హొటళ్ళపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. శ్రీవారి లడ్డూ ప్రసాదాల రుచి, నాణ్యత పెంపు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యంగా, రుచికరంగా అందించేందుకు నాణ్యమైన ముడిసరుకులు, నెయ్యి కొనుగొలు చేసేందుకు చర్యలు చేపట్టాం. టీటీడీ ఐటి వ్యవస్థ మరింత బలోపేతం టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాం. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్ఎస్డి టోకెన్లను, భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నాం, వీటిని మరికొంత పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నాం. అదేవిధంగా ఎస్ఈడి, ఎస్ఎస్ డి టోకెన్లు కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి దర్శనానికి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు శ్రీమతి గౌతమి, వీరబ్రహ్మం, సీఈఓ ఎస్ వి బి సి షణ్ముఖ్ కుమార్, సి ఈ నాగేశ్వరరావు, సివిఆర్ఓ డాక్టర్ టి.రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురండి

(మొదటి పేజీ తరువాయి) నగరంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తున్న అన్నా క్యాంటీన్లు లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన నాల్గవ తేదీ సాయంత్రానికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ మోహన్, స్మార్ట్ సిటి జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ.లు మహేష్, శ్రావణి, రాజు, ఏఈకాం ప్రతినిధి బాలాజీ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

ప్రత్యక్షమైన పునుగుపిల్లి

(మొదటి పేజీ తరువాయి) గుర్తించిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ లోకేష్ వెంటనే అటవీశాఖ అధికారులకు, రెవిన్యూ సిబ్బందికి సమాచారం అందించినా అందు బాటులోకి రాక పోవడంతో లోకేష్ తన స్నేహితులతో కలసి పునుగుపిల్లిని అటవీశాఖ కార్యాలయానికి అప్పగిం చారు. దీంతో స్పందించిన అధికారులు దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలి రక్షిస్తామని హామీ ఇచ్చారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

అంగన్వాడి సిబ్బందికి అవగాహన

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణవనం అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం ప్రారంభించడం జరిగినది బిడ్డకి పుట్టిన వెంటనే మురిపాలు అందించ వలయును అందులో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది కాబట్టి పుట్టిన గంట లోపల బిడ్డకి తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వడం మంచిదని బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తల్లిపాల శ్రేష్టకరమైందన్నారు. ఇతర ఏ ఆహారము ఇవ్వకూడదన్నారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అను బంధ పోషకాహారం అందించవలన్నారు. ఐసిడిఎస్ పిచ్చాటూరు ప్రాజెక్టు సిడిపిఓ శోభారాణి తెలియజేశారు. ఇందులో సూపర్వైజర్ బేబీ అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు కల్పించారు తల్లిలో కూడా కొన్ని సూచనలు సలహాలు అందించారు కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తల్లిలో తదితరులు పాల్గొన్నారు

తల్లిపాలు అమృతం

- వైద్య అధికారి దివాకర్

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : తల్లి పాలు బిడ్డకు అమృతం. బిడ్డకు ముర్రపాలు పట్టించడంతో వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలు కచ్చితంగా బిడ్డకు పట్టించాలని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి పివి దివాకర్ పేర్కొన్నారు. మండలంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు అయితే ఆ దీపం ప్రసరించే వెలుగు రేఖలు సంతానం, తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఆనందంగా ఉంటేనే ఆ ఇల్లు సంతోషంగా ఉంటుందన్నారు తల్లి బిడ్డలు ఆరోగ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఆరోగ్య పథకాలు అమలు చేస్తున్నది. వీటిని మండల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తల్లిపాలు బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి. పుట్టిన బిడ్డకు తల్లి పాలుపడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుంది. పసి పిల్లలకు అమృతం వంటి తల్లిపాలు, వాటి విశిష్టతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నది. పుట్టిన అరగంటలోపు బిడ్డకు పట్టే మురిపాలు ఎంతో శ్రేష్టమన్నారు లేత పసుపుపచ్చ రంగుతో కూడిన పాలను బిడ్డకు ఇవ్వడంతో పనికందు మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య అధికారి డి ఎన్ వెంకటేశులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిల్ప,ఆరోగ్య ప్రాథమిక సిబ్బంది,నర్సులు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రైవేట్ ల్యాబ్లను తనిఖీ చేసిన ప్రభుత్వ డాక్టర్లు

విశాలాంధ్ర - తడ : ఉన్నత అధికారుల ఆదేశాలతో తడ మండలంలో నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబ్ లను(దయాగ్నొస్టిక్ సెంటర్స్) శుక్రవారం తడ మండలంలోని పీహెచ్సీ వైద్యాధి కారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా తడ కండ్రిగ గ్రామంలో నిర్వహిస్తున్న ల్యాబ్ లను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రైవేట్ ల్యాబ్ నడుపుతున్న వారు విధిగా ల్యాబ్ టెక్నీషియన్ చదువుకున్న సర్టిఫికెట్లను వారి వెంట ఉంచుకోవాలని ల్యాబ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ,రెన్యూవల్ సర్టిఫికెట్ తప్పక కలిగి వుండాలని సూచించారు .ప్రతిరోజు రిజిస్టర్ మైంటైన్ చేయాలని, రోగుల వద్ద అధిక వసూళ్లు చేయకూడదని హెచ్చరించారు ఈ దాడులలో తడ పీహెచ్సీ డాక్టర్ ఎన్.కిశోర్ కుమార్, డాక్టర్ బీ.స్వర్ణలత మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ల్యాబ్లపై ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రవేట్ ల్యాబ్లపై వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీకాళహస్తి పట్టణం నందు అనుమతులు, నిబంధనలు పాటించని ప్రవేట్ ల్యాబ్లను కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశాలకు అనుగుణంగా పట్టణం నందు శ్రీరామ్ నగర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోగల ల్యాబ్ లను వైద్యాధి కారులు డాక్టర్ బాలు, డాక్టర్ శైలజ ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. రోగులు నుంచి అధికంగా అధిక ధరలు వసూలు చేసినా, అనవసరంగా పరీక్షలు నిర్వహించడం, లేని రోగాలు టైపాయిడ్, మలేరియా, డెంగ్యూ, ఉన్నట్లు చూపించి ప్రజలను భయబ్రాం తులకు గురిచేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ల్యాబ్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే శ్రీరాం నగర్ కాలనీ పరిధిలో గల ప్రజలు పట్టణ ఆరోగ్యకేంద్రంలోని ఉచిత ల్యాబ్లో గల సౌకర్యములను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన అసోసియేషన్ నాయకులు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఈ నెల 19వ తేదిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంను పురస్కరించుకొని ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్రెడ్డిని ఫొటోగ్రాఫ్ అసో సియేషన్ నాయకులు ఆహ్వానించారు. ఈ నెల ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవంను శ్రీకాళహస్తి ఫొటోగ్రాఫ్ అసోసియేషన్ నాయ కులు ఘనంగా జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఈ వేడుకల కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని శుక్రవారం శ్రీకాళహస్తి ఫొటోగ్రాఫ్ అసోసియేషన్ నాయకులు ఊరందూరు లోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆహ్వానించారు. అనతరం ఎమ్మెల్యేను జ్ఞాపికను బహు కరించి, శాలువ కప్పి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఫొటో గ్రాఫ్అ సోసియేషన్ప్రెసిడెంట్, ఫొటోగ్రాఫర్లు తదితరులు ఉన్నారు.

గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా : ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

విశాలాంధ్ర - గూడూరు : గ్రామ సేవకుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హామీ ఇచ్చారు. గూడూరు పట్టణంలోని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ భవనంలో గ్రామ రెవెన్యూ అధికారులు మరియు గ్రామ సేవకులు ఎమ్మెల్యేగా గెలుపొందిన పాశం సునీల్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు .పలు సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడు తూ అతి తక్కువ నెలసరి వేతనంతో గ్రామ సేవకులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అన్నారు. గ్రామ సేవకులు తెలియజేసిన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడటానికి గత వైసిపి ప్రభుత్వం కారణమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ గ్రామ అధికారుల సంఘం అధ్య క్షులు రమణయ్య , వి.అర్.ఏ జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య ,సభ్యులు ,పాల్గొన్నారు.

డాక్టర్ కోటేశ్వర బాబుకు ఎమ్మెల్యే అభినందనలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: సమాజ సేవలకు గుర్తింపుగా ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ తమిళనాడు నుండి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వర బాబును శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మూగజీవాలకు నిర్విరామంగా ఆహారాన్ని అందించడం ఆటో కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ అదే విధంగా నియోజకవర్గంలోని తొట్టంబేడు ,శ్రీకాళహస్తి, ఏర్పేడు, మండలాల్లోని గిరిజన విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేయడం షికారి, గిరిజన, కాలనీలోని నిరుపేదలకు అండగా ఉండడం అభినందనీయమని నాడు కరోనా సేవలకు గుర్తింపుగా ఆంధ్ర శ్రీ అవార్డు నేడు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం అభినందనీయం హర్షణీయం మని మునుముందు ఇదే విధంగా సేవలను కొనసాగించాలని కోరారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతుల మిన్న అని పేదరికంతో విద్యార్థులు చదువులకు దూరం కాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్కమనేని మధుబాబు, మదన్ మోహన్ నాయుడు, యువ నాయకులు నవీన్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

--- బాల్య వివాహాలు ---

ఆడపిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయి

విశాలాంధ్ర- సత్యవేడు: బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల బాల్యాన్ని దోచుకుంటుందని సత్యవేడు మండలం పివిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి చెప్పారు. శుక్రవారం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ చెంచు లక్ష్మి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపా ధ్యాయురాలు కృష్ణవేణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. 18 ఏళ్ల లోపు వివాహం చేసుకు న్న బాలికలు గృహహింస ఎదుర్కొనే ప్రమాదం ఉంద న్నారు. పైగా కౌమార దశలో గర్భవతి కావడం వల్ల ప్రసవ సమయంలో సమస్యలు ఎదురు కావడం తోపాటు ఆరోగ్యకరమైన బిడ్డ జన్మించే అవకాశాలు ఉండవన్నారు. పైగా బాల్య వివాహాల వల్ల దీర్ఘకాలిక ప్రతికూల పరిణామాలు వచ్చే అవకాశాలు లేకపోలేదు అన్నారు. దీనివల్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ చెంచులక్ష్మి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఐదుగురు బాలికలలో ఒకరు బాల్య వివాహం చేసుకుంటున్నట్టు అంచనా ఉందన్నారు. తదనంతరం బాల్య వివాహన నిర్మూ లనపై ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దీనకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు సుధ,సుగుణ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ హైమావతి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రతి పిల్లలకి తల్లిపాలు అవసరమని, అందులో పిల్లలకి వ్యాదిని నిరోదించే శక్తి ఉంటుందని, కాబట్టి ప్రతిఒ క్కరూ తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ హైమా వతి తెలిపారు. ఆగస్టు 1 నుండి 7 వరకు జరుగుతున్న తల్లిపాలవారో త్సవాలలో భాగంగా వెదల్లచెరువు ఎస్‌టి అంగన్వాడీలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హైమావతి సమక్షంలో పాలిచ్చే తల్లులకు అవగాహన కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా హైమవతి మాట్లాడుతూ ప్రతి పిల్లలకి తల్లిపాలు అవసరమని, అందులో పిల్లలకి వ్యాదిని నిరోదించే శక్తి ఉంటుందని, కాబట్టి ప్రతిఒక్కరూ తమ పిల్లలకు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని తెలిపారు. అలాగే అంగన్వాడీ సేవలను వినియోగిం చుకోవాలని కోరారు. ఏ ఎన్ ఏం సంధ్య మాట్లాడుతూ బాలింతలు పౌష్టికాహారాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, అంగన్వాడీలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఇమ్యునైజేషన్ వేయించుకోవాలని తెలిపారు. పిల్లల దగ్గర పాటించాల్సిన పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది సురేష్, ఆశా వర్కర్ కుమారి, అంగన్వాడీ వర్కర్లు గంగమ్మ, పార్వతి, యం పి పి స్కూల్ టీచర్ చంద్రవర్ధిని పాల్గొన్నారు.

ఉద్యానశాఖ రైతులు ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోండి

విశాలాంధ్ర - దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ రైతులకు అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని ఉద్యానశాఖ అధికారి యామిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి యామిని మాట్లాడుతూ నూతనంగా పండ్లు వేసే రైతులకి మామిడితోటకు 7950,జామాకి 17599 డ్రాగ్‌ప్రూట్‌కి,అంజీర్ 30000 రూపాయిలు సబ్బడీ అందిస్తామన్నారు. ఇలా పండ్ల తోటలకి మూడు సంవత్సరాలు పాటు రాయితీలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదే విధంగా కూరగాయలకి గాను 20వేలు రూపాయిలు,పూల తోటలకి,మల్చింగ్ కు 16 వేలు రూపాయిలు సబ్బడీ ఇస్తుందన్నారు. దేశీ మొక్కలకు 20 వేలు రూపాయిలు, వీదేశీ మొక్కలకు 29వేల రూపాయిలు వస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ వేసిన 4 ఏళ్లు పాటు పంటకు,ఎరువులకు 42వేలు హెక్టార్లుకు రాయితీలో అందస్తుం దని ఆమే పేర్కోన్నారు. రైతులకు పలు రకాలు రాయితీలు ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నామని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దొరవారిసత్రం మండల పరిధిలో ఉన్న ఉద్యాన పంటలు వేసే రైతులు 7995086941 నెంబర్లు సంప్రదింస్తే సలహాలు,సూచినలు అందిస్తామన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఫ్యామిలీడే వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో ఫ్యామిలి డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కుటుంబ బాంధవ్యాల గురించి తెలియ చేయడానికి ఫ్యామిలీ డే అనే ఈ వేడుకను నిర్వహించారు. దీని ద్వారా పిల్లలు కుటుంబంలోని అవ్వ, తాత, అమ్మ, నాన్న, వారి యొక్క ప్రాధాన్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ పిల్లలు పెద్దవారితో ఎలా మర్యాదగా మాట్లాడాలి, ఎలా నడుచుకోవాలి, తోడబుట్టిన వారితో ఏ విధంగా కలిసిమెలిసి ఉండాలని పిల్లలకు తెలియజేశారు. కుటుంబంలోని సభ్యుల వేషధారణలో వచ్చి, మిగిలిన విద్యార్థులకు ప్రదర్శన రూపంలో కుటుంబం యొక్క ప్రాధాన్యతను చూపించారు. ఈ సందర్భంగా ఎజిఎం సురేష్ మాట్లాడుతూ చదువుతో పాటు కుటుంబం యొక్క విలువలు విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జిలు కల్పన, వాసంతి, కోఆర్డినేటర్ అమ్మాజీ , ఉపాధ్యాయులు తనుతీ, శైలజ, శీలమ్మ, అనూష పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వాగివేడు గ్రామములో కుష్టు వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కుష్టు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి , ఎంపెడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్ సహా జాతీయ కుష్టు నివారణ ఇంటింటి కార్యక్రమంలో వాగివేడు గ్రామములో పాల్గొని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు కుష్టు నివారణపై చేస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం రోగులకు కుష్టి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈ నెల 18 నుండి పక్షం రోజుల పాటు కుష్టు వ్యాధి సర్వే నిర్వహించడం జరుగుతున్నదని, శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు నొప్పి లేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం, ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం మొదలైన లక్షణాలు ఉన్నట్లయితే కుష్ఠ వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని, వ్యాధి నిర్ధారణ కొరకు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. కుష్ఠువ్యాధిగా నిర్ధారణ జరిగితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కుష్ఠ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. జూలై నెల 18 నుండి పక్షం రోజుల పాటు ఇంటింటికి లెప్రసి కేసు డిటెక్షన్ సర్వే కాంపయిన్ చేయడం జరుగుతున్నదని, కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఈ కాంపయిన్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు వివరాలు తెలియ జేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, డీఎల్ఓ, డాక్టర్ రమణ ఫిజియో, డాక్టర్ సుధీర్ కుమార్, కిరణ్ కుమార్ డిప్యూటి డెమో, సూపర్ వైజర్లు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు వితరణ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే సునీల్ కుమార్ విచ్చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఎమ్మెల్యే ఐదు మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఒక మహిళకు కుట్టు మిషన్ అందజేశారు .అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు ఎమ్మెల్యే తన సొంత నిధులు 10,000 రూపాయలు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అనేకమంది దివ్యాంగులు తమకు ట్రై సైకిల్స్ కావాలని కోరగా మా మిత్రులు ఎల్ఎస్ ప్రాజెక్టు నిర్వాహకులు వాసు సహకారంతో కొన్ని ట్రై సైకిల్స్ అందిస్తున్నామని అన్నారు. అలాగే నియోజకవర్గంలో అవసరమైన దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ఎలక్ట్రికల్ వాహనాలు ప్రభుత్వం ద్వారా తప్పక అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమీ శ్రీనివాసులు,బిల్లు చెంచురామయ్య, చంద్ర,రహీం,పీట్టి నాగరాజు, సిద్దయ్య నాయుడు, భారతి తదితరులు పాల్గొన్నారు .

5న జరిగే ర్యాలీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు డివిజన్ పరిసర ప్రాంతాల్లో ఇసుక పూర్తిగా నిలిపివేయడంతో భవన నిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికై ఈ నెల 5వ తేదిన జరగనున్న ర్యాలీ ని జయప్రదం చేయాలని శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నాయకులు కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. అనంతరం విలేకర్ల సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య మాట్లాడుతూ కార్మికులు ఇసుక పూర్తిగా నిలిపివేయడంతో పనులు లేక పస్తువులతో గడుపుతున్నారని కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇసుకను ఉచితంగా ఇస్తామన్న హామీని ఇంత వరకు అమలు చేయలేదు అన్నారు .సుదూర ప్రాంతాల నుండి ఇసుక అత్యవసరంగా కావాల్సి వస్తే దళారులు ఒక ట్రాక్టర్ కు 6 వేలు కు పై మాట పలుకుతూ ఉందని తెలిపారు. గూడూరు డివిజన్ పరిధిలోని , కోట,వాకాడు, చిట్టమూరు, గూడలి, తూపిలిపాలెం, లో ఉన్న రీచ్ ల ద్వారా ప్రజలందరికీ ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద నుండి ర్యాలీ ప్రదర్శనగా బయలుదేరి వివేకానంద రోడ్డు మీదగా రైతు బజారు, రాజా వీధి, గాంధీ బొమ్మ, సంఘం థియేటర్ సెంటర్, హాస్పిటల్ రోడ్డు మీదుగా టవర్ క్లాక్ సెంటర్ కు చేరుకొని పై డిమాండ్లపై బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు .కార్మికులందరూ ఈ ర్యాలీ,ప్రదర్శనలో కార్మికులు సానుభూతిపరులు, ప్రజలు, మేధావులు, పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎస్.డి. రఫీ, సీనియర్ నాయకులు గండికోట మధు, బండి కిష్టయ్య, సి.ఐ.టి.యు నాయకులు జోగి శివకుమార్, పి.శ్రీనివాసులు, బి.వి.రమణయ్య, అడపాల ప్రసాద్, వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశుభ్రతగా ఉంచాలి: కమిషనర్

విశాలాంధ్ర – పుత్తూరు టౌన్ : పుత్తూరు ఉదయం కమీషనర్ పుత్తూరు వారు పుత్తూరు హిందూ స్మశానా వాటిక ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వున్న పిచ్చి మొక్కలు తొలగించే పనులు మరియు రోడ్డు స్వీపింగ్ పనులను పరిశీలించడం జరిగింది. అలాగే పట్టణం లోని ఎంబి రోడ్ ప్రక్కన జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించడం జరిగింది.అలాగే గెట్ పుత్తూరు బలిజ స్ట్రీట్ నందు చేపట్టిన స్పెషల్ శానిటేషన్ పనులను పరిశీలించడమైనది పుత్తూరు పట్టణం లోని విష్ణు థియేటర్ ప్రక్కన వున్న ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతను పరిశీలించి రేపటిలోగా గుంతను పూడ్చి వాహన దారులకు మరియు పాదచారులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోమని ఏ కి ఆదేశాలు జారీచేశారు పుత్తూరు జడ్జి రేపు వినాయకపురం కాలానీలో ఏర్పాటు చేయబోతున్న మెడికల్ క్యాంపు గురుంచి వినాయకపురము కాలనీ వాసులకు రేపటి ఉచిత మెడికల్ క్యాంపు ప్రాముఖ్యత గురుంచి చెప్పి అందరు ఈ సదావకాశన్ని సద్వినియోగం చేసుకొనవలసినదిగా కాలనీ వాసులను కోరడం జరిగింది.మెడికల్ క్యాంపు ఏర్పాట్లను పరిశీలించి మెడికల్ సిబ్బంది అందరు రేపటి ప్రోగ్రాం లో పాల్గొన వలెనని ఆదేశాలు జారీచేశారు.

నేడు విద్యుత్ అంతరాయం ఏర్పడే గ్రామాలు

విశాలాంధ్ర – చంద్రగిరి: చంద్రగిరి మండల పరిధిలోని నరసింగాపురం, నాగయ్య గారి పల్లి, రామిరెడ్డి పల్లి, కూచివారిపల్లి, బుచ్చినాయుడు పల్లి, శంకరయ్య గారి పల్లి, పుల్లయ్య గారిపల్లి, బంధార్లపల్లి, కొటాల, రంగంపేట, నారావారి పల్లి, కందుల వారి పల్లి, శేషాపురం, చిన్నారామాపురం, భీమవరం, ఎల్లంపల్లి, అగరాల, ఇతేపల్లి, మామండూరు, నడింపల్లి, ముంగిలిపట్టు, బోడంబాయి, కాశిపెంట్ల, కలురోడ్డుపల్లి, పనపాకం, పకాలవారిపల్లి మరియు అరిగెలవారిపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈ ఎన్ పాసిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరమత్తులు నిర్వహణ మెరుగుదలకు చర్యలు విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యల పరిష్కారం నిమిత్తం శనివారం (03.08.2024) ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుచేసుకోండి

విశాలాంధ్ర – పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకు గెస్ట్ లెక్చరర్ కావలెను. అర్హత(ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్) ఆసక్తి కలిగిన అభ్యర్థులు2024 ఆగస్టు 7వ తేదీలోగా మీ బయోడేటా తో కూడిన జిరాక్స్ సర్టిఫికెట్లు ప్రిన్సిపాల్ కార్యాలయము నందు సమర్పించాలి. ఆగస్టు 8వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ప్రిన్సిపాల్ కార్యాల యము నందు సంప్రదించండి.అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతానికి పైగా మార్కులతో పీజీ కలిగి ఉండాలి. నెట్, స్లెట్,సెట్, పీహెచ్డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

మామిడి తోటలో మెలకువలు పాటించి

చెట్లను సంరక్షించుకోండి

– బి.దశరథ రామిరెడ్డి

విశాలాంధ్ర – చంద్రగిరి: మామిడి తోట సాగులో మెలుకవలు పాటించి చెట్లను సంరక్షించుకోవాలని తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథ రామిరెడ్డి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ తో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం చంద్రగిరి మండలం ఐతేపల్లి మరియు భీమవరం గ్రామాలలోని శ్రీ లక్ష్మి కృష్ణ ఉద్యాన ఉత్పత్తి దారుల రైతు సంఘానికి చెందిన కలెక్షన్ సెంటర్లను తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి.దశరథ రామిరెడ్డి తనిఖీ చేసారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపుల అనంతరం పొలంలో లోతు దుక్కులు చేసుకుని 10 సంవత్సరముల పై బడిన చెట్లకు 100 కేజీలు పశువుల ఎరువు, 5 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , 2 కేజీలు యూరియా, 1.5 కేజీ పొటాష్ ఎరువులను చెట్టు మొదలు నుండి మూడు అడుగుల దూరంలో ఒక అడుగు వెడల్పుతో 15 సెంటీమీటర్ల లోతులో పాదులు చేసి ఎరువులను వేసుకుని మట్టితో మూసి నీరు పెట్టాలని తెలిపారు. రైతులు 10 సంవత్సరముల లోపు వయసుగల మామిడి తోటలలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 10-15 కేజీలు చల్లుకుని పూత వచ్చే ముందు దశలో పొలంలో దున్నుకోవాలని, ఈ విధంగా చేయడం వలన భూమిలో కర్బన శాతం పెరగడమే కాకుండా మొక్కకు రోగ నిరోధక శక్తి పెరుగుతుం దని, చెట్లు బెట్ట వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్. శైలజ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాలువ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు

హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

– ఏల్చూరి చంగల్ రాయుడు

విశాలాంధ్ర – చంద్రగిరి: కాలువ పోరంబోకు నందు అక్రమ నిర్మాణాలు తొలగింపునకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని ప్రజా సంకల్ప వేదిక సంస్థ జిల్లా ఉపాధ్య క్షులు ఏల్చూరి చంగల్ రాయుడు ఓ ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత ప్రభుత్వం లో ఫిబ్రవరి'2024 న చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి లెక్క దాఖలా, సర్వే నంబరు 326/2 కాలువ పోరంబోకు సంబంధి ంచిన స్థలంలో తుడా అనుమతులు లేకుండా అక్రమ ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. దీనిపై స్థానికుడైన ఆయన ఆక్రమణల తొలగింపునకు తహసిల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించలేదన్నారు. తదుపరి ఫిర్యాదుదారు అయిన వేల్చూరి చంగల్ రాయుడు ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు నందు సదరు అక్రమ నిర్మాణాలు తొలగించాలని రెవెన్యు అధికారులను, ఆక్రమణ దారులను పార్టీలుగా చేర్చి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఫిల్ 132/2024 నమోదు చేసారన్నారు. కేసు విచారించిన చీఫ్ జస్టిస్ బెంచ్ ధీరజ్ కుమార్ సింగ్, జస్టిస్ నైనల జయసూర్య లతో కూడిన ఉమ్మడి ధర్మాసనం 24-07-2024 వ తేదీన ఆదేశాలు జారీ చేస్తూ, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగింపునకు హైకోర్టు గతంలోనే డబ్లు ఫిల్ నం. 140/ 2022 ప్రజా ప్రయోజన వ్యాజ్యం నందు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారుల తీరు చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు వుందని, ప్రభుత్వ భూముల ఆక్రమణల కేసులు అనేక ఫిర్యాదులు కోర్టుకు వస్తున్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేసి, 6 వారాల్లో చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, పిటిషనర్ నుండి కూడా సమాచారం తీసుకోవచ్చని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. నీటి వనరుల భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని, ఆక్రమణలతో పర్యావరణం దెబ్బ తింటుం దని, మండలంలో పలు నీటి వనరుల భూములు ఆక్రమణకు గురవు తున్నా అధికారులు పట్టించు కోకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసారు. ఏల్చూరి చంగల్ రాయుడు చొరవపట్ల స్థానిక రామిరెడ్డిపల్లి రైతులే కాకుండా చుట్టుపక్క గ్రామాల రైతులు, ప్రజలు ఆయనకు, ప్రజా సంకల్ప వేదిక సంస్థ కు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ వర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన మున్సిపల్ అధికారులు

విశాలాంధ్ర – పుంగనూరు: పట్టణంలోని శుభారం డిగ్రీ కళాశాల వెనుక భాగాన ఉన్న రాంనగర్లో త్రాగునీటి సమస్యపై స్థానిక ప్రజలు టిడిపి నాయకులు రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాక కార్యదర్శి శ్రీకాంత్ పోలీస్ గిరి సివిరెడ్డి మైనార్టీ యువ నాయకులు సయ్యద్ సుహేల్ భాష సద్దాం హుస్సేన్ కు విన్నవించుకోవడంతో దీనిపై టిడిపి నాయకులు మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం జరిగింది అందులో భాగంగా శుక్రవారం రోజున మున్సిపల్ అధికారులు రాంనగర్ కాలనీకి వెళ్లి పైప్ లైన్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు ఇవ్వడం జరిగింది దీనిపై స్థానిక ప్రజలు టిడిపి చొరవతో త్రాగునీరు రావడంతో టిడిపి నాయకులకి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఎమ్మార్పీఎస్, టిడిపి ఆధ్వర్యంలో సంబరాలు

విశాలాంధ్ర – చంద్రగిరి: ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ టిడిపి నాయ కులు చంద్రగిరిలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. చంద్రగిరి బస్టాండ్ కూడలి లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచిపె ట్టారు. అనంతరం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టులో తీర్పురావటానికి కృషిచేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంఆ ర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల ఎంఆర్పిఎస్ సుదీర్ఘ పోరాట కళ నెరవేరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి మాదిగ, ఇసురుపాటి శంకర మాదిగ, సంగీతం రామ్మూర్తి మాదిగ, మండేరావు మాదిగ, కోడెదల రామ్మూర్తి మాదిగ, కృష్ణయ్య మాదిగ, చెంగల్ రాయుడు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలని ఎమ్మార్వోకి వినతి

విశాలాంధ్ర – పుంగనూరు:మండలంలోని ఆరడుగుంట గ్రామస్తులు శుక్రవారం రోజున మండల ఎమ్మార్వో శివయ్య ను కలిసి దారి సమస్య పరిష్కరించాలని విన్నవించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల తరపున మండల టిడిపి పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి ఎమ్మార్వో తో మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా గ్రామానికి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలియజేస్తున్నప్పటికీ దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించలేదని పేర్కొన్నారు గ్రామ సమీపన ఏర్పాటైన కాళహస్తి పైపుల్ ఫ్యాక్టరీ వారు ఎన్నో ఏళ్లుగా ఉన్న దారిని మూసి వేయడం వలన ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని గత వారం కిందట నేను స్వయంగా చెప్పినప్పటికీ మీరు చర్యలు చేపట్టకోవడం చాలా బాధాకరమన్నారు దీనివలన ఫ్యాక్టరీ యజమానులు గ్రామస్తులు నిత్యము ఘర్షలు పడి కేసులు పెట్టుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారం చేయాలని కోరడం జరిగింది దీనిపై ఎమ్మార్వో శివయ్య మాట్లాడుతూ గతంలో గ్రామానికి ఉన్న దారిని కాళహస్తి పైపుల ఫ్యాక్టరీకి అప్పుడున్న అప్పుడున్న ప్రభుత్వ కేటాయించడం జరిగిందని అందుకనే ఈ సమస్య అందుకనే ఈ సమస్య ఉత్పన్నమవుతు న్నదన్నారు. గ్రామస్తులుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై అంగన్వాడీ సిబ్బంది ర్యాలీ

విశాలాంధ్ర–సత్యవేడు: మండలంలో తల్లిపాలు వారోత్సవాలను పురస్కరించుకొని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతపై పలు అంగన్వాడీ కేంద్రాల్లో సంబంధిత అంగన్వాడి కార్యక ర్తలు,ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహిస్తున్నారు .ఇందులో భాగంగానే శుక్రవారం సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారం అంగన్వాడి కేంద్రం లో జరిగిన కార్యక్రమంలో తల్లిపాలు ప్రాముఖ్య తపై పలువురు తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త అనురాధ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అమృత తుల్యమన్నారు.కనీసం 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలును తాగించాలన్నారు.బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుం దన్నారు.దీంతోపాటు సులువుగా జీర్ణశక్తి అవుతుం దన్నారు.పోతపాలు వల్ల బిడ్డకు అనేక అనర్థాలు దారితీస్తుందన్నారు.తదనంతరం తల్లిపాలు ఆవశ్యకతపై అంగన్వాడి,ఆరోగ్య సిబ్బంది నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్ సుగుణ,ఏఎన్ఎం లతాదేవి,ఎంఎల్హెచ్పి సుమ,ఆశ వర్కర్లు వింధ్య, జైషీలా,తల్లులు పాల్గొన్నారు

కారు ఢీకొని వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర – తడ : మండల పరిధిలోని చేనిగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద కారు ఢీకొని మృతురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. తడ ఎస్ ఐ పి. నరసింహారావు సమాచారం మేరకు చేనిగుంట గ్రామానికి చెందిన కొల్లిపట్టు దయమ్మ (62) తన భర్తకు టిఫిన్ తెచ్చేందుకు జాతీయ రహదారి రోడ్డు మార్జిన్ పై నడిచి వెళ్తుండగా చెన్నై నుండి నెల్లూరు వైపుకు అతివేగంగా వచ్చిన కారు దయమ్మను ఢీకొట్టడంతో దయమ్మ తలకు, ప్రక్కటేముకలు విరిగి రోడ్డుపై పడి స్పృహ కోల్పోవడంతో స్థానికులు గాయపడ్డ దయమ్మ ను ప్రమాదానికి కారణమైన కారులోనే సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తలుస్తుండగా మృతి చెందినట్లు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

తిరుమలలోని వివిధ ప్రాంతాలలో టిటిడి ఈవో తనిఖీ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమితో కలిసి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాలను పరిశీలించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మొదట అన్నమయ్య భవనంలోని ఏపిటిడిసి నడుపుతున్న హెూటల్‌ని, పిఎసి-2, మాధవ నిలయాన్ని పరిశీలించి, నిర్మాణంలో ఉన్న కొత్త పిఎసి-5ని కూడా తనిఖీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉండేలా నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ఎస్వీ మ్యూజియంను ఆధునీకరిస్తున్న టిసిఎస్ బృందంతో కలిసి సందర్శించి పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం పాంచజన్యం వసతి గృహం వద్ద నూతన వంటశాల, బయట ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, విక్యూసీ కంపార్ట్‌మెంట్లు, అక్షయ కిచెన్‌లను ఈఓ పరిశీలించారు. కంపార్ట్‌మెంట్లలో యాత్రికులతో మాట్లాడి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, డీఈ ఎలక్ట్రికల్ రవిశంకర్ రెడ్డి, మ్యూజియం ఇంచార్జి అధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై గ్రామసభలు

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలోని ఇల్లుపూరు, మంగా నెల్లూరు గ్రామాలలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి. అనిత మరియు మండల వ్యవసాయ అధికారి కవిత ఆధ్వర్యంలో ఈ పంట నమోదుకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో సూళ్లూరుపేట మండలంలో 1100 ఎకరాలలో వరి పైరు సాగు చేస్తున్నారు. కావున ప్రస్తుతం పైరువేసిన రైతులందరూ వారి గ్రామ సహాయకులు వద్ద ఈ పంట నమోదు కు అవసరమైన వివరాలను ఇచ్చి నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతులు వారు ఏ సర్వే నెంబర్లు ఎన్ని ఎకరములు మరియు ఏ వరి రకము సాగు చేస్తున్నారు వారి యొక్క ఆధార్ నెంబరు మరియు మొబైల్ నెంబరు వివరములు ఇచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు .ఈ పంట నమోదు ద్వారా రైతులకు పంటల భీమా పథకము 0 వడ్డీ పంట రుణాలు మరియు ధాన్యం కొనుగోలుకు లింకు ఉంటాయి కావున తప్పనిసరిగా పైరు పెట్టిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి అని తెలిపారు. సోమవారం నుండి ఈ పంట యాప్ లో నమోదు జరుగును కావున సోమవారం లోపు మీరు మీ వివరములు మీ గ్రామ సహాయకులకు ఇవ్వాలని తెలిపారు. కవులు రైతులకు కవులు గుర్తింపు కార్డులు గ్రామ రెవిన్యూ అధికారి ద్వారా తీసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం కు గ్రామ వ్యవసాయ సహాయకులు గవాస్కర్, కవిత మరియు రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న ఎన్ఆర్ కమ్మపల్లి వాసులు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: మండలంలోని ఎన్.ఆర్ కమ్మపల్లి గ్రామస్తులు పులివర్తి నాని భారీ మెజారిటీతో చంద్రగిరి ఎంఎల్ఏ గా గెలుపొందాలని ఆర్ సి పురంలోని గ్రామ దేవత శ్రీ మూలస్థానమ్మ కు మొక్కుకున్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో పులివర్తి నాని ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందారు. దీంతో గ్రామస్తులంతా కలిసి శ్రీ మూలస్థానమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పులివర్తి నాని ఎన్.ఆర్ కమ్మపల్లికి చేరుకున్నారు. మండల పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే గారికి సాదరంగా ఆహ్వానం పలికారు. మహిళలు మంగళహారతులతో, యువత టపాకాయలు కాలుస్తూ... డ్రమ్స్ వాయిస్తూ... ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి ఒక్కరిని పేరుపేరునా అప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ నా గెలుపుకి కృషి చేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇదేవిధంగా అందరం కలిసి కట్టుగా గ్రామ అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే తెలిపారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే

ఎమ్మెల్యే డాక్టర్ థామస్

విశాలాంధ్ర-కార్వేటినగరం: దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే అని జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. మంగళవారం కార్వేటినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎంఈఓ విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదువుకొని ఐఏఎస్లుగా డాక్టర్లుగా ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా కావాలని పిలుపునిచ్చారు. తాను కూడా ఇదే పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నానని గుర్తు చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పినట్లు చదువుకోవాలని సూచించారు. అనంతరం ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ కార్వేటి నగరం ఉపాధ్యాయులకు పుట్టినిల్లు అని పేర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్ వన్ ప్లస్ టు తరగతులు చదువుతున్న విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ విద్యామంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరణ్, రాబర్ట్, గురుమూర్తి, హేమచంద్ర రెడ్డి, దొరబాబులు ప్రభుత్వము 117వ జీవోను రద్దు చేస్తే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయుల సమస్యలు పట్ల ప్రభుత్వముసానుకూలంగా ఎమ్మెల్యే అన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామాగ్రి కిట్లను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పంపిణీ చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇదే పాఠశాలలో చదివి శాసనసభ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు. జీడి నెల్లూరు జనసేన ఇంచార్జ్ ఉన్న యుగంధర్, చెంగ్రా యాదవ్, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, జీడి నెల్లూరు బీసీ సంఘ అధ్యక్షులు రవి యాదవ్, రాష్ట్ర బిజెపి నాయకు లుయువరాజు ఎంఈఓ మనోజ్ కుమార్, హెచ్ఎంలు కోటేశ్వరరావు, కేశవులు, గాయత్రి దేవి, సునీత, టిడిపి నాయకులు వాసుదేవ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బీగాల రమేష్, దాసరి గణేష్, కృష్ణయ్య, బిజెపి మండల అధ్యక్షులు రాజశేఖర్, జనసేన నాయకులు సురేష్ రెడ్డి, జ్యోతి శ్రీ, రూప్ కుమార్, ఎంఆర్సి సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు తిరిగి వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

విశాలాంధ్ర-చిత్తూరు: సాధారణ ఎన్నికలు 2024 సమయంలో జిల్లా నుండి బదిలీపై వెళ్ళిన తహశీల్దార్ లను ప్రభుత్వం తిరిగి చిత్తూరు జిల్లాకు కేటాయించగా, ఆ తహశీల్దార్లకు మండలాలను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టి. సీతారాంను అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, చిత్తూరు కలెక్టరెట్‌కు కె.బ్యూలా ను చిత్తూరు కలెక్టరెట్ కు, కె.పద్మజ చిత్తూరు కలెక్టరెట్, కో ఆర్డినేషన్ సెక్షన్‌కు, పి.మురళిని చిత్తూరు కలెక్టరెట్, ల్యాండ్ సెక్షన్ తహశీల్దార్ గా, జి.ఎం.కుమారస్వామిని చిత్తూరు కలెక్టరెట్, ల్యాండ్ అక్విజేషన్ సెక్షన్ తహశీల్దార్‌గా, ఆర్.వాసుదేవన్ చిత్తూరు కలెక్టరెట్, ల్యాండ్ రిఫామ్స్, స్పెషల్ తహశీల్దార్‌గా, ఎన్.ఎస్.కృష్ణ కుమార్ డిఏఓ, ఆర్‌డిఓ ఆఫీసు, చిత్తూరుకు, టి.జి.మోహనవల్లిని డిఏఓ, ఆర్‌డిఓ ఆఫీసు, పలమనేరు కు, పి.శివరామన్‌ను డిఏఓ, ఆర్‌డిఓ ఆఫీసు నగరికి జి.జయప్రకాష్‌ను డిఏఓ, ఆర్‌డిఓ ఆఫీసు కుప్పానికి ఏ.కళావతి చిత్తూరు అర్బన్ తాసిల్దార్‌గా కె.బెన్ను రాజ్‌ను సోమల తాసిల్దారుగా. బి.హనుమంతును చౌడేపల్లి, జి.చంద్ర శేఖర్ రెడ్డి గుడిపాల, బి.కుల శేఖర్‌ను సదుంకు, డి.రవి కుమార్‌ను నగరి, ఈ.శేషగిరి రావును నింద్రకు భగవతిని కార్వేటినగరానికి చంద్రశేఖర్‌ను జి.డి. నెల్లూరుకు, అమరనాథ్‌ను ఎస్.ఆర్.పురానికి, ఎం.అరుణ కుమారిని పాల సముద్రానికి గుర్రప్పను పూతలపట్టుకు, బాబు రాజేంద్ర ప్రసాద్ బంగారుపాళ్యానికి, ఇన్బ నాథన్‌ను పలమనేరుకు, పార్వతి వి.కోటకు, మాధవరాజును విజయపురానికి, చిట్టిబాబును కుప్పం, కె.అమరనాథ్‌ను శాంతిపురం, కె.బాబును రామకుప్పం, రామాంజుల నాయక్ గుడుపల్లి తాసిల్దార్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లక్ష్మీనారాయణ, తహశీల్దార్ ను తిరుపతి జిల్లాకు కేటాయించారు. జిల్లాలోని డిప్యూటీ తహశీల్దార్‌లను తహశీల్దార్లుగా పూర్తి అదనపు భాధ్యత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.ఎస్. ప్రసన్న కుమార్, డిప్యూటీ తహశీల్దార్, గంగవరంను పెద్ద పంజాణి తహశీల్దార్‌గా ఎన్.సుధాకర్, డిప్యూటీ తహశీల్దార్, ఐరాలను తవణంపల్లె తహశీల్దార్‌గా, బి. కళ్యాణి, డిప్యూటీ తహశీల్దార్, గుడిపాలను పెనుమూరు తహశీల్దార్‌గా, ఎస్.కిరణ్, డిప్యూటీ తహశీల్దార్, చిత్తూరు అర్బన్‌ను, విజయపురం తహశీల్దార్‌గా కె.మహేష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్, పెనుమూరును ఐరాల తహశీల్దార్‌గా, జి.ఎల్.శివ కుమార్, డిప్యూటీ తహశీల్దార్, డిఎస్ఓ కార్యాలయం, చిత్తూరును, గంగవరం తహశీల్దార్‌గా ఆర్.జయంత్, డిప్యూటీ తహశీల్దార్ రీసర్వే, వెదురుకుప్పం కార్యాలయంను యాదమరి తహశీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యత అప్పగించడమైనదని కలెక్టర్ తెలిపారు.

సీనియర్ సిటిజన్ డిపాజిట్లపై 8.3 శాతం వడ్డీ

డిసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: డిసీసీబీ బ్రాంచ్ బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 8.3 శాతం వడ్డీ ఇస్తున్నట్లు డిసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేష్ తెలిపారు. స్థానిక బ్రాంచ్ బ్యాంకులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాధారణ డిపాజిట్లపై 7.8 వడ్డీని అందజేస్తున్నామన్నారు. తమ బ్రాంచ్ లో అతి తక్కువ అద్దెతో లాకర్ వసతి ఉందన్నారు. ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, ఇతర చార్జీల భారం పూర్తిగా లేద న్నారు. బంగారం కుదరపెట్టుకుని రుణాలు అందిస్తు న్నా మన్నారు. స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాల కింద రైతులకు, వ్యాపారులకు, ఉద్యోగులకు, డ్వాక్రా సంఘా లకు, సకాలంలోనే రుణాలు ఇస్తున్నామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అనాలోచిత నిర్ణయం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: ఎస్సీ వర్గీకరణ పై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ధర్మాసనం అనాలోచిత నిర్ణయం తీసుకుందని కేంద్ర మాజీ మంత్రి చింతామణి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను పునః ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ నేత చింతామోహన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు పట్ల మనోవేదనకు లోనట్లు చెప్పారు. ఈ ఎస్సీ వర్గీకరణ పట్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నట్లు చెప్పారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఈ తీర్పు ఉందన్నారు. తద్వారా అనేకమంది ఎస్సీలకు పలు రకాలుగా నష్టం కలిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. మూతబడ్డ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్లను తెలుగుదేశం ప్రభుత్వం వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ మూతపడడంతో అనేకమంది ఎస్సీలకు ఉపాధి అవకాశాలు కరువయ్యా అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం దళిత అధికారులను ప్రభుత్వ కార్యాలయంలో నియమించకపోవడం బాధాకరమన్నారు. తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వం దళిత అధికారులకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణేలపై అవగాహన ప్రదర్శన

విశాలాంధ్ర-చిత్తూరు: పాత కొత్త కరెన్సీ పై అవగాహన ప్రదర్శన జరిగింది పంచాయతీ కేంద్రం పుధిపట్ల ఉన్నత పాఠశాలలో పలు రకాల నాణేలపై ప్రదర్శన నిర్వహించారు. పుంగనూరు కి చెందిన సాయి కృష్ణ గత 15 ఏళ్లుగా రాజులు బ్రిటిష్ పాలనలో కరెన్సీని భారతదేశం తోపాటు విదేశీ కరెన్సీని విద్యార్థులకు చూపిస్తూ అవగాహన కల్పించారు తన తల్లి మంజుల ప్రేరణతో నాణేలను సేకరించి భావితరాలకు చూపిస్తున్నట్లు సాయి కృష్ణ వివరించారు చిన్నతనం నుంచి నాణేలను సేకరించి ప్రదర్శనలు ఇవ్వడం శుభ పరిణామమని ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ ఉపాధ్యాయులు సాయికృష్ణను సన్మానించారు.

గడ్డంవారి పల్లి విఆర్ఓకు రివర్షన్

విశాలాంధ్ర-చిత్తూరు: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూములను ఆక్రమించినందుకు చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి విఆర్ఓ వై.వెంకటమునికి విఆర్ఏ గా రివర్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి పుంగనూరు మండల పరిధిలో ప్రభుత్వ అసైన్ భూమిని తన అధికార దుర్వినియోగం చేసి తన స్వంత కుటుంబ సభ్యుల పేరున పట్టా మంజూరు చేయించారన్న ఫిర్యాదుతో మదనపల్లె సబ్ కలెక్టర్ ను విచారణ అధికారిగా నియమించి విచారించడం జరిగిందని, ఈ విచారణలో చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి విఆర్ఓ వై.వెంకటముని తన అధికార దుర్వినియోగం చేసినట్లు రుజువు కావడంతో విఆర్ఏగా రివర్షన్ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటలో తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లితే సాధ్యం కానిది లేదు

విశాలాంధ్ర-కార్వేటినగరం: విద్యార్థి దశనుంచి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లితే సాధ్యం కాని ఏది లేదని తిరుపతి డీఈవో, జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. శుక్రవారం డైట్లో నిర్వహించిన ఫ్రెషర్స్ డే సమావేశానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కార్వేటినగరం డైట్కు ఓ ప్రత్యేక ఉందని, ఇక్కడ విద్యాభ్యాసాలు చేసిన ఛాత్రోపాధ్యాయులు ప్రతి ఒక్కరూ ఆధ్యాపకులుగా ఉద్యోగాలు సాధించారని గుర్తు చేశారు. అలాంటి అహ్లాదకరమైన వాతావరణం కలిగి, అన్ని విధాల అనుభవం కలిగిన అధ్యాపకులున్న డైట్లో విద్యనభ్యసించడం మీ అదృష్టంగా భావించాలన్నారు. రానున్న డీఎస్సీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఛాత్రోపాధ్యాయులు ఉపాధ్యాయులుగా ఇంటికి వెళ్లాలని సూచించారు. అలాగే అధ్యాపకులు అందించే సలహాలు, సూచనలు తప్పక పాటించి తమ లక్ష్యాన్ని చేదించేంత వరకు విశ్రమించ కూడదని పేర్కొన్నారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఒలపిక్ క్రీడలో విజయం కోసం క్రీడాకారులకు ఉన్న దృఢ సంకల్పం ఛాత్రోపాధ్యాయులకు ఉండాలని వారిని ఆదర్శంగా తీసుకుని పోటీ తత్వంతో పరీక్షలకు తరవు అవ్వాలను పిలుపునిచ్చారు. ఈ క్రమంలో భాగంగా ఛాత్రోపాధ్యాయులు చేపట్టిన నృత్యాలు పలువురిని ఆకట్టుకుంది.అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఒలపిక్ క్రీడలో విజయం కోసం క్రీడాకారులకు ఉన్న దృఢ సంకల్పం ఛాత్రోపాధ్యాయులకు ఉండాలని వారిని ఆదర్శంగా తీసుకుని పోటీ తత్వంతో పరీక్షలకు తరవు అవ్వాలను పిలుపునిచ్చారు. ఈ క్రమంలో భాగంగా ఛాత్రోపాధ్యాయులు చేపట్టిన నృత్యాలు పలువురిని ఎంతో ఆకట్టుకుంది. అదే విధంగా కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఛాత్రోపాధ్యాయులకు ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ చేతుల మీదుగా మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నిర్మల, దేవప్రసాద్, రఫీ, రెడ్డి వెంకటరమణ, సునీత, అనిత, నాగరాజ నాయక్, శ్రీనివాసులురెడ్డి, ఛాత్రోపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందించిన సచివాలయ ఉద్యోగి

విశాలాంధ్ర-పిచ్చాటూరు: పిచ్చాటూరుకు చెందిన కే.సరోజమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్బర్ తిరుపతి లోని సరోజమ్మ చికిత్స పొందే ఆస్పత్రికి చేరుకొని వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలు నగదును అందించారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు 60 కిలో మీటర్లు ప్రయాణించి పెన్షన్ పంపిణీ చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ అక్బర్‌ను సరోజమ్మ కుటుంబసభ్యులు, స్థానిక ప్రజలు అభినందించారు.

పట్టణాభివృద్ధిని మరిచిన గత పాలకులు

- అవకాశం ఇచ్చారు అభివృద్ధి చేసి చూపుతాం..
- ప్లాస్టిక్ రహిత పట్టణముగా శ్రీకాళహస్తి
- శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని మురికినీరు పోయే కన్నలి, ఓటేరు, కాలువను శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భాజపా రాష్ట్ర కార్యదర్శి మాజీ పాలకమండలి అధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్ పురపాలక సంఘం కమిషనర్ రమేష్ బాబు అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు, ఓటేరు కాలువలో చేరిపోయిన చెత్తాచెదారాలను శుభ్రపరిచి మంచి వాతావరణంలో ప్రజలు సుభిక్షంగా ఉండేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే కన్నలి కాలువ ప్రాంతంలో ఉంటున్నటువంటి ప్రజలను స్వయంగా వారి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలకు ఉన్న సమస్యలను వెనువెంటనే పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలుజారీ చేశారు, బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. గతప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాళహస్తిని పట్టించుకున్న దాఖలాలు లేవని, తాను అధికారం చేపట్టిన వెంటనే శ్రీకాళహస్తి సస్యశ్యామలంగా చేసే దిశగా కార్యాచరణ చేపడుతూ, నేడు ఓటేరు, కన్నలి, కాలువను పరిశీలించామని, ఈ కాలువ చెత్త చెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉందని, ఒక నెల లోపల ఈ కాలువను శుభ్రపరిచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశానని, ఆ కాలువలోని చెత్తాచెదారాన్ని తీసివేసి, శ్రీకాళహస్తిలో ఎటువంటి దుర్గంధం లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు జీవనం సాగించే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు, మొన్న జరిగిన శాసనసభ సమావేశాల సందర్భంలో పురపాలక సంఘ మంత్రి నారాయణ 50 లక్షల రూపాయలు శ్రీకాళహస్తి పురపాలక సంఘం అభివృద్ధికి నిధులను కేటాయించారని, ఈ నిధులతో ప్రస్తుతం పరిశీలించిన కాలువలు పరిశుభ్రపరిచి ఎక్కడ ప్లాస్టిక్ లేకుండా ప్లాస్టిక్ రహిత శ్రీకాళహస్తి గా తీర్చిదిద్దుతానని తెలియజేశారు. ప్రస్తుతం దుర్గంధంగా ఉన్న కాలువ పరిస్థితిని, భవిష్యత్తులో శుభ్రమైన కాలువ పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకునివెళ్లి శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి మరికొంత నిధులు మంజూరయ్యేలా కార్యాచరణ చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, టిడిపి శ్రేణులు పట్టణ అధ్యక్షులు విజయకుమార్, కంటా రమేష్, షాకిరాలి, బషీర్, మునిరాజు నాయుడు, పోలూరు శ్రీనివాసులు రెడ్డి భాజపా పార్టీ శ్రేణులు అమర్నాథ్, భరత్ రాయల్, హరి, జనసైనికులు స్థానిక వార్డు ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో విశాఖపట్టణంలో జరుగుతున్న ఏఐటియుసి జాతీయ సమితి సమ్మేళనలను జయప్రదం చేయండి అని గోడ పత్రికలను. కరపత్రాలను విడుదల చేసినట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి కే రాధాకృష్ణ లు తెలిపారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో చేపట్టవలసిన పోరాట కార్యక్రమాలకు ఇక్కడ రూపకల్పన జరుగుతుందని స్కీం వర్కర్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల కనీస వేతనం 26000 ఉండే విధంగా పోరాడటం.. రాష్ట్రంలో విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం ప్రైవేటీకరణ ఆపుదల చేయడం కోసం పోరాటం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం పునరుద్ధరణకై ప్రయత్నం చేయడం. కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగింది దాన్ని రద్దుకై పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం కాకుండా ఆపుదల చేయడం రాజకీయ వేధింపులు ఆపడం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్నం భోజనం ఆశ అంగన్వాడి స్కూల్ ఆయాలు వివోఏలు తీసివేసి తెలుగు దేశం అనుకూలురులనుపెట్టుకోవడం కోసం తీవ్ర ప్రయత్నం జరుగుతుందని దానికి వ్యతిరేకంగా రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమానికి రూపకల్పన జరుగుతుందని అలాగే మూడవ తేదీన విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభలో తిరుపతి జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్మిక వర్గం కదలి రావాలి అని వారు పిలుపునిచ్చారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎన్.డి.రవి ఎన్.శివ కేవైరాజా సిహెచ్ శివకుమార్ మహేంద్ర బాబు. శ్రీనివాసులు మీనా ప్రమీల వెంకటేష్ సురేష్ కిషోర్ ఏపీ బాలశెట్టిపల్లి రవి రైల్వే బాల అల్లాభకస్ మరియు ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరపాలక కార్మికుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర-చిత్తూరు: ఆరోగ్యంతోనే ఆనందం కలుగుతుందని, కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షించే నగర పురపాలకల్లోని కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం క్రమం తప్పకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక కార్యాలయం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, కమిషనర్ అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ. నగర, పురపాలక సంఘాల పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రత్యేక వైద్యులతో చికిత్స అందిస్తామన్నారు. ఇదే సమయంలో కార్మికులకు ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏడాదికి రూ.1,500 చెల్లించడం ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని పొందవచ్చన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలో ఏడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుతుందని వివరించారు. నగర, పురపాలక సంఘాల్లో విధులు నిర్వహించే కార్మికులకు యూనిఫామ్, గ్లౌజులు, మాస్కులు, బూట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అందించడానికి వీలుగా ప్రత్యేక అధికారిగా మెప్మా పీడీని నియమిస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కార్మికుల పనితీరు వెలకట్టలేనిదని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కృషి చేస్తానని, కార్మికులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్మికులు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, చిత్తూరు నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. మేయర్ ఎస్ అముదమాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని కార్మికులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో మొదటిరోజు 25 వార్డులకు సంబంధించిన పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు కమిషనర్ అరుణ చెప్పారు. అపోలో, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన 14 మంది వైద్య నిపుణులు 10 విభాగాల్లో వైద్య చికిత్సలు అందించారన్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పల్మనాలజీ, డెంటల్, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్, కంటి, ఈ ఎన్టీ, న్యూరో, విభాగాల్లో కార్మికులు వైద్య పరీక్షలు నిర్వహించుకొని, మందులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరం శనివారం కొనసాగుతుందని, మిగిలిన కార్మికులు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు కార్యక్రమంలో ఎంహెచ్వో డా. అనిల్ కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కె.హేమలత, కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించండి

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయపరిధిలో ఓజిలి మండలం పున్నేపల్లి గ్రామంలో 6 సంవత్సరాల మైనర్ బాలిక పై ఆత్యాచార ఘటన జరిగిన విషయం తెలిసిందే.బాధిత కుటుంబాన్ని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు.దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నేషనల్ చైర్మెన్,ఫౌండర్ బి.వెంకటేశ్వరరాజు,నేషనల్ వైస్ చైర్మెన్ కళ్యాణి చౌరాసీయ ఆదేశాల మేరకు ఓజిలి పోలీస్ స్టేషన్ కు వెళ్లగా ఎస్సై అందుబాటులో లేకపోవడంతో నాయుడుపేట రూరల్ సిఐ గారిని కలిసి బాధితులకు అండగా నిలిచి నిందితుడికి కఠిన శిక్షలు అమలు చేయాలని కోరారు.ఈసందర్భంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ,ఓజిలి మండలం పున్నేపల్లి గ్రామంలో 6 సంవత్సరాల బాలికపై అత్యాచారం యత్నం చేయడం చాలా దారుణమని అన్నారు.మనవరాలి వయసు వున్న బాలికపై అఘాయిత్యం చేసిన వ్యక్తిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ జగన్మోహన్రావుని కోరారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసుల్ని కోరామని అలాగే పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పరిసరాల్లో గమనిస్తూ ఉండాలని సమాజంలో కొందరు మేక వన్నె పులులు లాగా బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతూ ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని దిశప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. సమాజంలో ప్రత్యేకించి ఒంటరి మహిళలు చిన్నపిల్లలు నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న మహిళలకు ఎలాంటి కష్టం వచ్చినా తమ ఫౌండేషన్ సభ్యులు అండగా ఉంటారని ఎవరు తాము ఒంటరిమని కుంగిపోవద్దని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు అండగా ఉంటామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లెం విమలమ్మ,నెల్లూరు జిల్లా ప్రెసిడెంట్ విజయనిర్మల,అధికార ప్రతినిధి సులోచనమ్మ, సెక్రటరీలు ఆవుల సుప్రియ, రాజ్యలక్ష్మి (కీర్తిరెడ్డి) తదితరులు ఉన్నారు.

కిడ్నీలో ఎన్ని రాళ్లయినా వెన్నతో తీసేస్తా

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మహిళ

విశాలాంధ్ర - పాలసముద్రం : కిడ్నీలో రాళ్లు ఎన్నైనా నేను వెన్నతో తీసేస్తా ఎంత పెద్ద రాయి అయినా తీయటంలో నాకు మించిన వారు లేరు అంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతుంది ఓ మహిళ. మండలంలోని ఆముదాల పంచాయితీ లోని కొత్త కండిగ గ్రామంలో ఓ మహిళ కొన్ని సంవత్సరాలుగా నాటు వైద్యం పేరుతో నిత్యం సరిహద్దు రాష్ట్రాల నుంచి చుట్టుపక్కల నుంచి కిడ్నీ బాధితులను రప్పించుకొని వారికి వెన్నపూసి రాళ్లు తీసి మీకు ఇంకా కిడ్నీలకు సంబంధించిన రాళ్లు పూర్తిగా తొలగిపోయిందని రాళ్లు పూర్తిగా వచ్చేసాయని ఇక ఎలాంటి వైద్యం మీకు అవసరం లేదని చెప్పడంతో వారు ఇది నిజమే అని నమ్మి ఎలాంటి వైద్యం చేయించుకోకుండా ప్రాణాలు పైకి తెచ్చుకుంటున్నారని ఈ కాలం ఉన్నత చదువులు చదివిన వైద్యులకే సాధ్యం కానీ పని వీరికి సాధ్యమవుతుందా మంత్రాలకు చింతకాయలు రాలుతాయా ఇదంతా మోసమని ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవటమేనని కొందరు ప్రజలు అంటున్నారు ఇకనైనా ఇలాంటి మోసాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజల ప్రాణాలు కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

డాక్టర్ కోటేశ్వర బాబు యువతకు ఆదర్శం

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: సంఘ సేవకులు కోటేశ్వర బాబు నేటి యువతకు ఆదర్శమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి అన్నారు.సమాజ సేవలకు గుర్తింపుగా ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ తమిళనాడు నుండి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబుని రాష్ట్ర అధికార ప్రతినిధిరెడ్డి వారి గురువారెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు,డాక్టర్ గుమ్మడిపూడి దశరదాచారి, గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు, పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చెల్లు రాఘవులు దుస్సాలవాతో గౌరవించి అభినందించడం జరిగినది.ఈ సందర్భంగా రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మూగజీవాలకు నిర్విరామంగా ఆహారాన్ని అందించడం ఆటో కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ అదేవిధంగా నియోజకవర్గంలోని తొట్టంబేడు శ్రీ కాళహస్తి ఏర్పేడు మండలాలలోని గిరిజన విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయడం షికారి గిరిజన కాలనీలోని నిరుపేదలకు అండగా ఉండడం అభినందనీయమని నాడు కరోనా సేవలకు గుర్తింపుగా ఆంధ్ర శ్రీ అవార్డు నేడు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం అభినందనీయం హర్షనీయం మని మరెంతో ముందుకు ఇదే విధంగా సేవలను కొనసాగించాలని విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని తెలిపారు ఇలాంటి ఉన్నతమైన అవార్డులను మరెన్నో తీసుకోవాలన్నారు ఈ యొక్క కార్యక్రమంలో మంగారెడ్డి, చింత గింజల సునీల్, కుమార్, రాజేష్, మణికంత, శ్రీహరి రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

విశాలాంధ్ర-చిత్తూరు: విద్యార్థులు సత్ప్రవర్తనతో అధ్యాపకులు, తల్లిదండ్రుల మాటలను విని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు సమస్యలను అధ్యాపకులు ఎమ్మెల్యే మురళీమోహన్ దృష్టికి తీసుకొచ్చారు. కళాశాలకు రోడ్డు సౌకర్యం, క్రీడా మైదానం లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులను వెంటనే పిలిపించి దారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి జూనియర్ కళాశాలకు దారి సమస్య పరిష్కరించడమే కాకుండా, క్రీడా మైదానంను కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగిస్తూ విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని, విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అత్యంత కీలకమైనదన్నారు. విద్యార్థులు మంచిగా తయారు కావాలన్న, చెడుగా తయారు కావాలన్న ఈ రెండు సంవత్సరాలు అత్యంత కీలకమైనదని తెలియజేసారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల మాటలను విని మంచిగా ఎదగాలన్నారు. పూతలపట్టు జూనియర్ కళాశాల సమస్యల గురించి అవసరం అయితే విద్యాశాఖమంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని, కళాశాలలో ఏ సమస్య వచ్చినా అధ్యాపకులు గానీ, విద్యార్థులు గానీ నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తానే ఆ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదాం అని సిడిపిఓ శాంతి దుర్గ పిలుపునిచ్చారు. ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలో భాగంగా సందర్భంగా ఐసిడి ప్రాజెక్ట్ శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం కమ్మ కొత్తూరు గ్రామం నందు శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సిడిపిఓ శాంతి దుర్గ మాట్లాడుతూ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదాం పిలుపునిచ్చారు. పుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. ఎంఇఒ భువనేశ్వరి తల్లిపాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సరు, ఓవరీస్ క్యాన్సరు అరికట్టవచ్చు అని తెలిపారు. ఎఇ చందనా మాట్లాడుతూ తల్లిపాలతో పాటు పోషికాహారము పరిశుభ్రత అవసరమని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సీమంతం నిర్వహించి, పోషక పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి శ్రీనివాసులు, సిహెచ్ఓ దేవి ప్రసన్న, జిఎంఎస్‌కె చెంచులక్ష్మి, ఎఎన్ఎం రజని, ఆశా వర్కర్లు రాజ్యలక్ష్మి, ఇంజనీర్ అసిస్టెంట్ షాలిని, అంగన్‌వాడి వర్కర్లు కల్పన, మునెమ్మ, సులోచన, మేరి, జ్యోత్స్న, కళ, తులసి, రంగమ్మ, సుబ్బలక్ష్మి, అన్నపూర్ణ, కల్పన, గ్రామ నాయకులు పి.బాబు, ఎన్.చిరంజీవి, కె.దుర్గప్రసాద్, గర్భిణీలు బాలింతలు, గ్రామస్తులు హాజరయ్యారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలంలో ఐదు స్టాక్ పాయింట్లు, పాప సముద్రం, కొత్తపల్లి, 197 రామాపురం, వసంతాపురం, బొమ్మసముద్రం లలో ప్రతి స్టాక్ పాయింట్‌కి జొన్న ఐదు క్వింటాళ్లు, మొక్క జొన్న ఐదు క్వింటాళ్ల విత్తనాలు పాడి రైతుల కోసం సిద్ధంగా ఉన్నాయని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని మండల వెటర్నటీ వైద్యాధికారి సాయి సుధా అన్నారు. ప్రభుత్వం 70 శాతం రాయితీతో పాడి రైతులకు జొన్న మొక్కజొన్న అందిస్తుందని కావున పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా వెటర్నటీ వైద్యాధికారి కోరారు.

నినాదాలతో హోరెత్తిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి గజ పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా చరిత్రాత్మకమైన తీర్పును ఇవ్వడం జరిగింది. ఎస్సీల్లో ఉండబడిన 59 కులాలను ఏబిసిడిలుగా వర్గీకరించాలని.30 సంవత్సరాల క్రితం ఎస్సీలకు సమాన హక్కులు వాటా పంపిణీ జరగాలని ఏర్పడిన (ఎమ్మార్పీఎస్) మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సుదీర్ఘంగా న్యాయపోరాటం చేయడం జరిగింది. అయితే 2024- ఫిబ్రవరి 6,7,8 తేదీల్లో సుప్రీంకోర్టులో వాదనలు జరిగి.. తీర్పుని రిజర్వ్ చేయడం జరిగింది, నేడు ఆ తీర్పుని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై చంద్రచూడ్ ఎస్సీల్లో అసమానతలు తొలగడానికి రాష్ట్రాలు వర్గీకరణను అమలు. చేయడం న్యాయబద్ధమైనదని తీర్పునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా నగరి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ జాతి బిడ్డలందరి సమక్షంలో, ఎంతో భావోద్వేగంతో ఎస్సీ వర్గీకరణ తీర్పుని స్వాగతిస్తూ టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని,సంబరాలు చేసుకోవడం జరిగింది.అలాగే ఎం ఎస్ పి ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ నాయకులు వావిళ్ళ శివయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగలు మరియు ఇతర ఉపకులాల చిరకాల లక్ష్యమైన ఎస్సీ వర్గీకరణ కొరకు 30 సంవత్సరాల నుండి ఎన్నో అవమానాలు, అవాంతరాలు, వెన్నుపోట్లు ఎదుర్కొని మాన్య మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటాలు చేయడం జరిగిందని, అయితే చివరకు నేడు వర్గీకరణకు ఆటంకాలు లేవని తీర్పు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఎమ్మార్పీఎస్ నగరి సీనియర్ నాయకులు కుమారస్వామి మాదిగ రామచంద్ర మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భారత ప్రధాన మంత్రి అయినటువంటి గౌరవ నరేంద్ర మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అమిత్ షా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన కృషి మరువలేనిది అని తెలియజేశారు. వందలాదిగా కార్యకర్తలు చేరుకొని బాణసంచా పేల్చుకుంటూ పెద్ద ర్యాలీ నిర్వహించేసి, అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్షీరాభిషేకం పూలమాల వేసి న్యాయం గెలిచిందని అన్నారు. బాణసంచాలు కాల్చి, స్వీట్లు తో ఒకరినొకరు ఎమ్మార్పీఎస్ సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ సాయి మాదిగ గిరిబాబు మాదిగ వెంకటేష్ మాదిగ మనీ మాదిగ బ్రహ్మయ్య మాదిగ సుబ్రహ్మణ్యం వరప్రసాద్ గిరి శ్రీనివాస్ మాదిగ పరుశురాం మాదిగ నడిపయ్య యువ నాయకత్వం పుత్తూరు నగరి లో తదితరులు పాల్గొనడం జరిగింది.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- గూడూరు ఆర్‌డివో కిరణ్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టమును పటిష్టంగా అమలు చేయాలని, వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సమాజం లో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే అని ఆడపిల్లల పట్ల వివక్షత ఉండ కూడదు అని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంను కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చని అన్నారు. జిల్లాలో ప్రతి నెల అన్ని స్కానింగ్ కేంద్రాలను డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడు తున్న స్కానింగ్ సెంటర్ల వారి రిజిస్ట్రేషన్ తొలగించడం జరుగుతు oదని అన్నా రు. స్కానింగ్ సెంటర్లో రిజిస్ట్రేషన్, రెన్యు వల్ , ఇతర మోడిఫికేషన్ దరఖాస్తుల ను ఆన్లైన్లో మాత్రమే స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్పు లన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి అను మతి తప్ప నిసరిగా పొందా లని తెలిపారు. ఈ చట్ట మను అతిక్ర మించిన వారికి రూ.500 00 రూపా యలు జరిమానతో బాటు 3 సంవత్స రాల కఠినమైన శిక్ష లు ఉంటాయని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసినవారు 102,104 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. ప్రజల లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ చట్టం పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మస్తనమ్మ , డివిజనల్ పరిపాలన అధికారి శిరీష, డెమో బాబు నెహ్రు రెడ్డి , డిప్యూటీ సివిల్ సర్జన్ సంపూర్ణ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ బి.గిరిజ, సి.డి.పి.వో మెహబూబి, గూడూరు రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

6న జరిగే జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

- ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని శుభారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా చేస్తున్న రాష్ట్రవ్యాప్త సంక్షేమ హాస్టల్ సమస్యల సర్వేలో భాగంగా సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి కోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రేటెడ్ బిల్డింగ్ లో ఉన్నటువంటి విద్యార్థులకు సొంత భవనాలను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వమిచ్చే మెనూని సక్రమంగా అమలు చేయాలని మెనూ సక్రమంగా అమలు చేయని వార్డెన్లపైన రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుని, అలాగే సంక్షేమ హాస్టల్స్ లో ఖాళీగా ఉన్నటువంటి వార్డెన్ వాచ్మెన్ కామాటి కుక్క పోస్టులను భర్తీ చేయాలి. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ హాస్టల్లలో మహిళా విద్యార్థులు స్నానము చేసేటటువంటి గదులకి డోర్ తలుపులు లేవని మరికొన్ని హాస్టల్లో స్నానం చేయడానికి నీళ్లు కూడా విద్యార్థులే బయటనుంచి వెళ్తున్నారని దీనివల్ల ఆడపిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని దీనిపైన జిల్లా కలెక్టర్ తక్షణమే తనిఖీలు నిర్వహించి సమస్యలు ఉన్నచోట పరిష్కారం చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న జరిగే చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు అన్ని నియోజకవర్గాల నుండి విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పుంగనూరు పట్టణ కమిటీ సభ్యులుగా పట్టణ అధ్యక్షులు సతీష్, పట్టణ కార్యదర్శిగా మోహన్ ,ఉపాధ్యక్షులుగా ధనుష్ ,రాజేష్ ,ఆసిఫ్ అలీ, సహాయ కార్యదర్శులుగా రెడ్డి ,తేజ, గర్ల్స్ కన్వీనర్లుగా జయను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

డ్రై డేతో వ్యాధులు దూరం

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర -తిరుపతి : ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించడం ద్వారా విష జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జులై 1 నుండి జులై 31 వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా శుక్రవారం గిరిపురంలో నిర్వహిస్తున్న డ్రై కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రై డే ద్వారా వ్యాధులు ఎలా అరికట్టవచ్చని ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత, డ్రై డే వంటివి పాటించడం వలన డయేరియా, చికెన్ గున్యా, మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలు దరిచేరవని అన్నారు. దోమల లార్వా వారం రోజులు పాటు ఉంటుందని, వారంలో ఒక్కరోజు డ్రై డే పాటించడం దోమల లార్వాలు చనిపోతాయని అన్నారు. తద్వారా విష జ్వరాలు ప్రబలకుండా ఉంటాయని అన్నారు. కావున ప్రజలు వారంలో శుక్రవారం డ్రై డే పాటిస్తూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి అన్నారు. అలాగే తాగిన వాటర్ బాటిల్స్, టెంకాయ చిప్పలు, వినియోగించాలని ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, టైర్లు వంటివి ఇంటి పరిసరాల్లో ఉండకుండా, అందులో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి రోజూ కాచిన నీరు తాగడం మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, మేస్త్రిలు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ ఎస్ఐ రెడ్డినాయక్ మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి రుయా ఆసుపత్రిలో ఎస్ఐ పార్థివ దేహానికి జిల్లా ఎస్పీ పూలమాలవేసి వందనం చేశారు.ఎస్ఐ కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.తిరుపతి జిల్లా తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నరు ఈరోజు ఎదా విదిగా స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తున్న సందర్భంలో ఆకస్మికంగా గుండె పోటు రావడంతో సిబ్బంది హుటా హుటిన స్థానిక రుయా ఆసుపత్రి లో తీసుకెళ్ళారు అక్కడ చికిత్స పొందుతూ అకాల మరణం చెందారు.విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు వెంటనే రుయా ఆసుపత్రికి వెళ్లి ఎస్ఐ భౌతిక దేహానికి పుష్ప మాలవేసి వందనంచేశారు. ఎస్ ఐ కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ అన్ని విధాలుగా మీకు అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ ధైర్యాన్ని చెప్పారు.ఎస్ఐ రెడ్డి నాయక్ స్వస్థలం అన్నమయ్య జిల్లా, కె.వి పల్లి మండలం, జిల్లెల్లమంద పెద్ద తాండ గ్రామం. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్ శాంతిభద్రతలు, డి.ఎస్.పి రామకృష్ణ చారి తిరుపతి ట్రాఫిక్, సీఐ చిన్న పెద్దయ్య ట్రాఫిక్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డి, ఎస్ఈడి టికెట్లు పొందిన భక్తులు

కేటాయించిన సమయానికే రావాలి

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమలలో భక్తులు అనవసరంగా వేచి ఉండకుండా ఉండేందుకు ఎస్ఈడీ టికెట్స్, ఎస్ఎస్‌డీ టోకెన్లపై కేటాయించిన సమయాన్ని పాటించాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు శుక్రవారం భక్తులకు విజ్ఞప్తి చేశారు.చాలా మంది భక్తులు తమ ఎస్ఎస్‌డి టోకెన్‌లు , ఎస్ఇడి టికెట్లపై కేటాయించిన సమయం కంటే చాలా ముందుగా దర్శనానికి రావడంతో, వారు చాలా గంటలు వేచి ఉండవలసి వస్తోందన్నారు. టిటిడి గత కొన్ని రోజులుగా భక్తుల టోకెన్లు లేదా టికెట్లపై పేర్కొన్న విధంగా వారికి కేటాయించిన సమయంలో మాత్రమే దర్శన క్యూ లైన్లలోకి ప్రవేశించడానికి అనుమతిస్తోంది.కానీ, ఇప్పటికీ చాలా మంది భక్తులు చాలా ముందుగానే తిరుమలకు వచ్చి ఆరుబయట వేచి ఉండి ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. డయల్ యువర్ ఈఓ కార్యక్రమం ద్వారా, భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా సమయపాలన పాటించాలని టీటీడీ ఈవో విజ్ఞప్తి చేశారు.తిరుమలలో భక్తుల సమాచారం కోసం ఇప్పటికే తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్‌తో సహా మొత్తం ఐదు భాషల్లో ప్రకటనలు చేస్తున్నాం.నేటి నుండి తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్‌లతో పాటు శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద కూడా కూడా భక్తుల సమాచార నిమిత్తం ప్రకటనలు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలియజేశారు .భక్తులు క్యూ లైన్ల వెలుపల వేచి ఉండకుండా, తిరుపతి లోని స్థానిక ఆలయాల సందర్శన లేదా తిరుమలలోని ఆధ్యాత్మికప్రదేశాలను సందర్శించవచ్చని ఈవో తెలిపారు.

72 వార్షికోత్సవం
అక్షరాక్షరం అభ్యుదయం అన్న ఆయుధంతో
ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న
విశాలాంధ్ర జాతీయ దిన పత్రికకు
72వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
సంఘ బంధం కార్యాలయం,
ఓజిలి (మం), తిరుపతి జిల్లా.

72 వార్షికోత్సవం
తెలుగు జాతీయ పత్రికా రంగంలో అలుపెరుగని
పోరాటం చేస్తూ..
సంచలనమైన కథనాలతో బడుగు, బలహీన, కార్మిక, కర్షక ప్రజాసమస్యలపై
నిరంతరం పోరాటం చేస్తున్న విశాలాంధ్ర జాతీయ తెలుగు
దినపత్రికకు 72వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.. పత్రిక
యాజమాన్యానికి, సిబ్బందికి, విలేకరులకు మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.
మండల విద్యాశాఖ అధికారి,
కార్యాలయ సిబ్బంది, ఓజిలి (మం), తిరుపతి జిల్లా.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటీ, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, ఏర్పేడు,
రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాలెం
బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134